క్లుప్తంగా

సమావేశాన్ని విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రేపు (శనివారం) ఉదయం 10గంటలకు నిర్వహించనున్న జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ యూనియన్ సెక్రెటరీ మోత్కూరి కోటి ఉద్యోగులకు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ నలువాల స్వామి, జిల్లా అధ్యక్షుడు కొసరి భాస్కర్ హాజరుకానున్నారన్నారు. కావున ప్రతి అర్టిజన్, అన్ మ్యాన్ మీటర్ రీడర్స్, సెక్షన్స్‌వారీగా సబ్ డివిజన్ పరిధిలోని అర్టిజన్లు, అన్ మ్యాన్ కార్మికులు, మీటర్ రీడర్స్, మూకుమ్మడిగా తరలిరావాలన్నారు. భవిష్యత్ కార్యాచరణ గురించి రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.

భూములకు రక్షణ కల్పించాలని వినతి



వెంకటాపురం(కె): ఆదివాసీల అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ గురువారం ఆదివాసీ సీనియర్ నాయకులు పూనెం సాయి ఆధ్వర్యంలో దానవాయిపేట గ్రామ గిరిజనులు తహసీల్దార్ నల్లెట్ల సృజన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ.. దానవాయిపేట ఆదివాసీలకు 1996లో ప్రభుత్వం అసైన్డ్ పట్టాలతో పాస్ పుస్తకాలను ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఆదివాసీలు ఆ భూమిని సాగు చేసుకుంటున్నారని అన్నారు. కాగా ఆదివాసీల భూములపై కొందరు గిరిజనేతరులు పెత్తనం చెలాయించాలని చూస్తున్నారని అధికారులు రక్షణ కల్పించాలని కోరారు. నర్సింహారావు, నాగరాజు, రామ్, సత్తమ్మ, నారాయణ ఉన్నారు.

జబ్బార్ కుటుంబానికి అండగా ఉంటా..



ములుగు రూరల్: ములుగు మండలం జగ్గన్నపేట గ్రామానికి చెందిన కొట్టం వెంకటనారాయణ(జబ్బార్) కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. సీతక్క వ్యక్తిగత సహాయకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా దశదిన కర్మకు ఆమె హాజరై జబ్బార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. జబ్బార్ మృతి కాంగ్రెస్ పార్టీకి తనకు ఎంతో తీరని లోటని అన్నారు. జబ్బార్ కుటుంబానికి ఎల్లవేళ అండగా ఉండి కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. జబ్బార్ కుమార్తె పేరున రూ.5లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడంతో పాటు కూతురి చదువుకు సంబంధించిన బాధ్యత తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆమె వెంట జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం ఎంపీటీసీ అల్లి సుమలత మామ, శ్రీనివాస్ తండ్రి అల్లి లాలయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి గురువారం పరామర్శించారు. బీఆర్ఎస్‌పార్టీ నాయకులు సునీల్, మల్లారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: వెంకట్రావుపల్లిలో ఉట్టి కొడుతున్న బాలుడు



కాటారం: ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రాధమ్మ



భూపాలపల్లి రూరలల్: ఆజాంనగర్‌లో..



శ్రీకృష్ణాష్టమి వేడుకలు



తల్లితో శ్రీకృష్ణుడి వేషధారణలో బాలుడు

జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడి, గోపిక వేషధారణతో అలరించారు. గ్రామాల్లో యాదవ సంఘాల, ఆలయ కమిటీల, ప్రజాప్రతినిధుల, నాయకుల ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులు పెద్ద ఎత్తున పాల్గొని ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



చిట్యాల: ఉట్టికొట్టే కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్



మహదేవపూర్‌లో..



కాటారం: ఆదర్శ కాలనీలో కృష్ణాష్టమి వేడుకల్లో ఎంపీపీ సమ్మయ్య





టేకుమట్ల: కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు

ధరలు తగ్గించాలని నిరసన



తహసీల్దార్ కరపత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: నిత్యావర సరుకుల ధరలు తగ్గించాలని మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం మండల నాయకులు భూక్య నవీన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే అధిక ధరలు అరికట్టాలని, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని, యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సుమన్‌కు కరపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మొగిలి, గంట రజిత, సునీత, తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణ్‌రావు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం చంద్రుపల్లిలో ఎస్సై లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. మావోయిస్టులకు సహకరించవద్దని, అపరిచితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయన వెంట టీఎస్ఎస్‌పీ పోలీసులు ఉన్నారు.

ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులెప్పుడు?



ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమయ్యాయని, వాటికి ఎప్పుడు మరమ్మతులు చేపడుతారని కాంగ్రెస్, సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం రేగొండ మండలంలోని ధ్వంసమైన రోడ్ల వద్ద కాంగ్రెస్, సీపీఐ నాయకులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రేగొండ–భూపాలపల్లి ప్రధాన రోడ్డు నుంచి బుగులోని జాతరకు వెళ్లే ప్రధాన రోడ్డు పూర్తిగా ధ్వంసమైనా ఇప్పటి వరకు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంలో అంతర్యమేంటన్నారు. అలాగే రేగొండ మండలంలోని మొత్తం ఆరు ప్రధాన రోడ్లకు భారీ గండ్లు పడి రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతున్నా పట్టించుకున్న నాథుడే లేడని మండిపడ్డారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి ప్రజా సమస్యలను పట్టించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, నిమ్మల విజేందర్, సాగర్, మోహన్, కుమారస్వామి, రమేష్, రఘుపతి, రమణారెడ్డి పాల్గొన్నారు.

బీసీ సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకుమట్ల: హైదరాబాద్‌లో ఈ నెల 10న నిర్వహించే బీసీ సింహగర్జన పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆముదాలపెల్లి మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో గురువారం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ఆవిష్కరించారు. మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, మొగుళ్లపల్లి జెడ్పీటీసీ సదయ్య, రవీందర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారుడికి చెక్కు ఇస్తున్న ప్రకాశ్‌రావు

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన చెన్నూరి చిన్నయ్యకు రూ.14 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాశ్‌రావు తాడిచర్లలో గురువారం లబ్ధిదారుడికి చెక్కును అందజేశారు. పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్‌ల ఆదేశాల మేరకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తాడిచర్ల గ్రామశాఖ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ మల్క రాజేశ్వర్‌రావు, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, నాయకులు మల్లేష్, సాంబయ్య, సదానందం, ఓదెలు, బాపు పాల్గొన్నారు.

ఆరు నెలలకే కుంగిన రోడ్డు!



పగుళ్లు పట్టిన తారురోడ్డు



కుంగి పొయిన తారురోడ్డు

- రూ. 4.50కోట్ల వ్యయంతో బీరసాగర్‌కు తారురోడ్డు, కల్వర్టు నిర్మాణం
- నాణ్యతా లోపంతో ఏర్పడిన పగుళ్లు
- ఆందోళన చెందుతున్న గిరిజనులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మెట్‌పల్లి పంచాయతీ పరిధిలోని బీరసాగర్‌కు దాదాపు ఆరు నెలల కింద వేసిన తారు రోడ్డు నాణ్యతలోపంతో కుంగి, పగుళ్లు ఏర్పడ్డాయి. ఇంజనీరింగ్‌శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. బీరాసాగర్ గ్రామానికి గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు, కల్వర్టులు లేక వర్షాకాలంలో నానా అవస్థలు పడేవారు. దీంతో ప్రభుత్వం వారి ఇబ్బందులు చూసి రోడ్డు మంజూరు చేసి నిధులు మంజూరు చేసింది. మెట్‌పల్లి గ్రామం నుంచి 1.500 మీటర్ల రోడ్డు, మధ్యలో వాగు వద్ద కల్వర్టుకు కలిపి రూ.4.50కోట్ల వ్యయంతో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో వేసవికాలంలో నిర్మించారు.

నాణ్యతకు తిలోదకాలు!

రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యతా లోపంతో నాసిరకంగా రోడ్డు నిర్మించి మమా అనిపించారని ఆరోపణలు ఉన్నాయి. ఆరు నెలల కాకముందే రోడ్డు పగుళ్లు తేలింది. వర్షానికి అక్కడక్కడా కుంగి గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు నిర్మాణం సమయంలో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేదని, సదరు కాంట్రాక్టర్ మనుషులే అంతా చూసుకున్నారని స్థానికులు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రోడ్డుకు మరమ్మతులు చేయాలని మొరపెట్టుకుంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..



రోడ్డు వేయడంతో మా రవాణా కష్టాలు తీరాయి అనుకున్నాం. నాణ్యత లేని పనులు, నాసిరకం మెటల్, మట్టి వాడడంతో రోడ్డు దెబ్బతింది. వర్షానికి అక్కడక్కడా కుంగి, పగుళ్లు తేలాయి. ఈ రోడ్డులో కనీసం భారీ వాహనాలు కూడా నడిచిన దాఖలాలు లేవు. నిర్మాణ సమయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండి పట్టించుకోకపోవడంతోనే రోడ్డు దెబ్బతింది.

– ములుకల శ్రీనివాస్, మెట్‌పల్లి

రోడ్డును పరిశీలించాం..

బీరసాగర్ రోడ్డును ఇటీవలనే పరిశీలించాం. కల్వర్టు వద్ద కుంగింది, రోడ్డు కూడా స్వల్పంగా దెబ్బతింది. కాంట్రాక్టర్‌కు ఐదు సంవత్సరాలు మెంటనెన్స్ ఉంటుంది. త్వరలో ఆ కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయిస్తాం.

– సాయిలు, డీఈఈ, పంచాయతీరాజ్‌శాఖ

అనుమతి పత్రాలు కలిగిఉండాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై శాఖాన్

చిట్యాల: వాహనం నడిపే ప్రతీ వాహనదారుడి దగ్గర అనుమతి పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని రెండవ ఎస్సై ఎండి.శాఖాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. పత్రాలు సరిగా లేకుండా వాహనాలను నడిపిన పది మందితో పాటు, ఒకరిపై డ్రంకన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు



ఓపీ విభాగంలో వేచిఉన్న ప్రజలు



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

మహదేవపూర్: మండల వ్యాప్తంగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గురువారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో విష జ్వరాలతో ఆస్పత్రి నిండి పోయింది. మండలంతో పాటు కాటారం, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాల నుంచి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రల సరిహద్దు నుంచి జ్వరాలతో మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. 10 రోజుల నుంచి విష జ్వరాలతో, ఇతర ఆరోగ్య సమస్యలతో ప్రతి రోజు 250 మంది ఆస్పత్రికి వస్తున్నట్లు సమాచారం. ఇందులో 60 నుంచి 80 మంది వరకు విష జ్వరాలతో వస్తున్నారని వైద్యులు తెలుపుతున్నారు. 30 పడకల ఆస్పత్రి కావున 50 మంది వరకు బెడ్స్ కేటాయించి మిగిత వారిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి పంపిస్తున్నట్లు సుపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆస్పత్రిలో ముగ్గురు డాక్టర్లు మాత్రమే ఉన్నారని, 30 బెడ్స్ నుంచి 50కి పెంచి డాక్టర్లను వెంటనే కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో అంబట్‌పల్లి, కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్న అవి సరిగా పని చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిరుపేదలకు ‘గృహలక్ష్మి’ అందించాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు



కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మల్హర్: ఇళ్లు లేని నిరుపేదలందరికీ గృహలక్ష్మి పథకం అందించాలని ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి తదితర పథకాలపై అధికారులు పారదర్శకంగా వ్యవహరించి, లబ్ధిదారులకు అందించాలని సూచించారు. కల్యాణలక్ష్మి చెక్కులు అందించడంలో కొంత మంది లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన వారిపై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

మండలంలోని ఓసీపీ ప్రాజెక్టుకు 500 మీటర్ల పరిధిలోని పెద్దతాడిచర్లలో డేంజర్ జోన్‌లోని భూములు, ఇళ్లకు భూసేకరణ వేగవంతం చేయాలని శ్రీధర్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. అనేక పోరాటల ఫలితంగా గత సంవత్సరం 2022 డిసెంబర్‌లో 2652 ఇళ్లు, 359.20 ఎకరాల భూమి సేకరణకు జెన్‌కో అధికారులు పీఎన్(ప్రాథమిక నోటిఫికేషన్) ప్రకటించారని తెలిపారు. 10 నెలలు గడుస్తున్న భూసేకరణపై స్పష్టత కరువైందన్నారు. అప్పటికైనా జెన్‌కో, రెవెన్యూ అధికారులు జాప్యం చేయకుండా పీఎన్ ప్రకటించిన భూములు, ఇళ్లకు భూ సేకరణ వేగవంతం చేసి, నిర్వాసితులకు నష్టం పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అయిత రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, సర్పంచ్ రాజునాయక్, నాయకులు చంద్రయ్య, తిరుపతిరావు, మొండి, రాహుల్, ప్రభాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు గురువారం లబ్ధిదారులకు అందజేశారు. మండల వ్యాప్తం 50 కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నారాయణరెడ్డి

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన బాణాల లక్ష్మి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.